# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 10

పేజీలు 40

జూన్ 2017

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


భద్రవాక్యం ............................................................2

శ్రీబాబూజీ ఉవాచ.................................................... 4

శ్రీ కాళీప్రసాద ఆశ్రిత ఆశ్రయం .................. .6

అమ్మమాట................................................................ 7

సాధనలో అవాంతరాలు ...................................... 9

జ్ఞాననేత్ర ప్రదాయకాయ నమః ............... 10

అంజలి ....................................................................11

అక్కా- బావా!...........................................................12

త్రిపురా రహస్యం ................................................... 15

కామేపల్లిలోవిజయవంతంగా ముగిసిన

శ్రీమహామృత్యుంజయమహాయాగము...17

త్యాగమయిలు సుమిత్ర - ఊర్మిళ ...... 18

క్రీస్తు ఆస్తిక్య బుద్ధి ................................................ 20

ముండకోపనిషత్తు ............................................... 21

యోగ ముద్రలు .......................................................23

యోగవాశిష్ఠము ................................................ 25

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..............................27

పరిప్రశ్న .....................................................................28

నిజమైన విశ్వాసం .............................................. 30

శ్రీకృష్ణకర్ణామృతము............................................32

ప్రాణాయామ సిద్ధి ....................................................33

బ్రహ్మ వ్రాత ................................................................34

అనపాయి రామనామం ................. 35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...... 37

విష్ణు కథలు- మీరాబాయి..................................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

సర్వభూత స్థమాత్మానం సర్వభూతానిచాత్మని ।
సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా ॥
(కైవల్యోపనిషత్ -10వ శ్లోకం)

ముక్త స్థితి అన్నా, కైవల్యం అన్నా, ఆత్మానుభూతి అన్నా సాధకుడు చేరవలసిన గమ్యంగా గుర్తించాలి. అయితే ఆ స్థితి ఈ దేహాన్ని త్యజించిన తరువాత పొందేదా? ఎన్నడూ కాదు. అది కేవలం ఈ దేహం ఉండగానే సశరీరంగా పొందే అనుభూతి.

ముక్తస్థితి అంటే బంధ విముక్తి. అది సాధకుడు ఆచరించే సత్కర్మల ద్వారా సాధ్యమా? సాధ్యం కాదు. పోనీ మన శ్రేయస్సు కోరే బంధుమిత్రుల సహాయసహకారాల వలన సాధ్యమా? అసంభవం! ఆలా కాని పక్షంలో మన బుద్ధిబలం చేతగాని, ధనం చేతగాని సాధ్యమా? అది ఏదైనా క్రియద్వారా పొందటానికి అది వస్తువయితే కదా! అది కేవలం అనుభూతి అంతరంగంలో పొందే అనుభవం. అయితే ఆ స్థితిని పొందే మార్గమే లేదా? ఉంది.

మానవుడు స్వప్నావస్థలో ఎన్నో అనుభూతులు పొందుతాడు. కాని తాను మేల్కొనగానే స్వప్నంలో దర్శించిన ప్రపంచమంతా మనస్సు యొక్క అభివ్యక్త రూపంగానే తెలుసుకుంటాడు. అంతేకాదు స్వప్న ప్రపంచమంతా మేల్కొనగానే మనస్సులో లయమైపోతుంది. ఇది ప్రతి ఒక్కరూ పొందే అనుభవమే. అలాగే ధ్యానావస్థలో మనస్సు స్థిరపడితే దేహ మనో బుద్ధుల తాదాత్మ్యాన్ని వదలి అనగా జీవభావాన్ని వదలి ఆత్మానుభూతిని పొందుతాడు. అయితే తానింతవరకూ అనుభవించిన విషయ ప్రపంచం ఏమైనట్లు? అది పరమాత్మలో లయమైనదన్నమాట. ఆత్మానుభూతిని పొందిన వెంటనే ప్రపంచం అంతా అదృశ్యమైనట్లే. ధ్యానావస్థ నుండి వెలుపలికి వచ్చిన తరువాత కూడా జ్ఞాని బాహ్య ప్రపంచంలోని నామరూపాత్మకమైన ప్రతి వస్తువులోనూ పరమాత్మనే దర్శిస్తాడు. అదే ముక్త స్థితి.

అందువలన ఈ శ్లోకంలో సాధకుడు సులభంగా ఆత్మానుభూతిని పొందే మార్గాన్ని సద్గురుమూర్తి సూచిస్తున్నారు. సమస్త భూతములను తన యందు దర్శించ గల్గాలి. అలాగే సమస్త భూతముల యందు తననే దర్శించ గలగాలి. ఆ స్థితిని పొందిన సాధకుడు ముక్త స్థితిని సాధించినట్లే. అదే బ్రహ్మపదమును చేర్చగల్గిన స్థితి. అట్టి సాధకునికి మరుజన్మ లేదు. జన్మ రాహిత్యాన్ని పొందటానికి 'నాన్యేన హేతునా' అంటే ఇంతకన్న సులువైన మార్గం లేదని అర్థం. అదే అమృతత్త్వ స్థితి. అంటే మరణం లేని స్థితి, స్థిరమైన స్థితి, మార్పులేని స్థితి, పరిణామ రహితమైన స్థితి, అదే మోక్షస్థితి.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జూన్ 2017

09 శుక్రవారం జేష్ఠ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

19 సోమవారం - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30 నిలకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

జూలై 2017

04 మంగళవారం - తొలి ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

09 ఆదివారం - ఆషాఢ (గురు) పౌర్ణమి, ఉదయం 11గం॥లకు, శ్రీ సద్గురుపాద పూజ, సత్సంగం, భక్త సమారాధన-చతుర్మాస దీక్షా ప్రారంభం

18 మంగళవారం - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30నిలకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

అవతార పురుషులు, మహాత్ములు అనుక్షణం భగవంతునితో తాదాత్మ్యాన్ని పొందుతారు కదా మరి వారికి కూడా దేహబాధ ఏమిటి? వారుకూడా వ్యాధిగ్రస్తులై బాధపడతా రెందుకు? వారికి వ్యాధి ఎందుకు సంక్రమించింది? అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "ఆ సబ్జెక్ట్‌ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. మీ ఇంట్లో మేడమెట్లు దిగుతుండగా అనుకోకుండా జారి క్రిందపడి కాలు విరిగిందనుకోండి. దాని బాధ్యత మీదా లేక మేడమెట్ల లోపమా! అలాగే మీరు ప్రయాణించే విమానం కూలిపోయిందనుకోండి ఆ లోపం ప్రయాణీకులదా లేక విమానందా? విమానమైనా, మీ దేహమైనా యంత్రాలే కదా! అవిపరిణామంతో కూడినవి. యంత్రము చెడిపోకుండా కొంతకాలము మాత్రమే గ్యారెంటీగా పని చేయగల్గుతుంది.



సర్వజగత్తుకి ఆధారం చైతన్యమే అందులో సందేహము లేదు. కానీ జగత్తు పరిణామంతో కూడింది కదా. జగత్తు చెందే పరిణామానికి చైతన్యము కేవలం సాక్షి మాత్రమే. బల్బు చెడిపోయింది అనుకోండి. అది కాంతిని ఇవ్వగలుగుతుందా? కానీ కరెంటు ఉంది. బల్బు మాత్రం వెలగదు. అదే కరెంటు ఫ్యాను తిరగటానికి వినియోగపడవచ్చు. దీనికి మీరేమంటారు?" అని ప్రశ్నించారు.

"సామాన్య మానవులైనా, సాధకులైనా, భక్తులైనా, మహాత్ములైనా ఉపాధిని త్యాగం చేయవల్సిందే. అయితే మహాత్ములు మాత్రం ఈ ఉపాధిని ఒక షర్టుని వదిలివేసినట్లు త్యాగం చేస్తారు. వారికి ఏది

జరుగుతోందీ, ఏది జరిగిపోయిందీ, ఏది జరగబోయేదీ, అంతా తెలుసు. అయినప్పటికీ వారు ఏమీ తెలియనట్లుగా, సాక్షిగా ఉంటారు. మానవులు ఎంత గొప్పవారైనా కర్మతో ముడిపడియున్న ఈ దేహమును త్యజించవల్సినదే. ఎవరి స్టేషన్ వచ్చినపుడు వారు దిగిపోవాలి. రైలు ప్రయాణంలో అలా మన స్టేషన్‌లో దిగకుండా వేరే స్టేషన్‌లో దిగుతామంటే టికెట్ కలెక్టర్ ఊరుకుంటాడా? నిబంధనలు అడ్డం వస్తాయి.

అలాగే కర్మ ద్వారా సంక్రమించిన దేహం కర్మరహితమైన మరుక్షణం దానిని త్యాగం చేయవల్సిందే. అయితే సమర్థులైన గురువును ఆశ్రయించిన భక్తులు మాత్రం ఉపాధిని త్యాగం చేసి జీవన్ముక్తిని పొందుతున్నారు. విషయాదులతో ముడిపడిఉన్న మానవులు మాత్రం జనన మరణ విషవలయంలో పడి వట్టి చేతులతో మట్టి పాలవుతున్నారు. అవతార పురుషుడు అయినా ధర్మ సంస్థాపన నిమిత్తం ఉపాధి ధరించి వచ్చిన శ్రీ కృష్ణపరమాత్ముడు అర్జునునికి రథసారథిగా కర్మ నిర్వహించలేదా? కురుక్షేత్ర సంగ్రామంలో ఏది జరగబోయేది ఆయనకు తెలియదా? మరి ఆయన ప్రజలను పాలించి కర్మ నిర్వహించలేదా?

ఈ ప్రపంచం నాకు భిన్నం కాదు అంతా ఏకమే అచలమే అన్న భావన గల జ్ఞాని ఎన్నడూ భయపడడు. దుఃఖించడు. తన స్వస్థానములో ఉంటాడు. కాబట్టి ఆనందంగా ఉంటాడు దేహం తాను అనే భావనలో ఉన్న సాధకుడు అవసరాలకి, అవకాశాలకి, మోద ప్రమోదాలకి, జయాపజయాలకి స్పందించి కుంగటం, పొంగటం వంటి మానసిక అనుభవాలకి బద్ధుడై ఉంటాడు. తన ఉనికికి, అస్థిత్వానికి మూలాన్ని గుర్తించిన మరుక్షణం బంధన నుండి విముక్తి" అన్నారు శ్రీ బాబూజీ మహారాజ్.

# శ్రీకాళీ ప్రసాద ఆశ్రితాశ్రయము

- రమణ ప్రసాద్

కర్నూలు సమీపమున ఉన్న నందికొట్కూరులో ది. 23-3-2016 న, అక్కడి భక్తులందరి సహాయ సహకారములతో శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయ స్థాపన జరిగినది. అప్పటినుండి అయ్యప్ప స్వామి వారి ఆలయంలో నిత్య పూజార్చనలు జరుగుతున్నాయి. అచ్చటనున్న భక్తులు



ముఖ్యముగా శ్రీయుతులు బాలయ్యగారు, శ్రీయుతులు ధర్మారెడ్డిగారు, శ్రీయుతులు లక్ష్మీనారాయణరావుగార్లు సేవాభావముతో ఆ ప్రాంగణములో ఒక వృద్ధాశ్రమము ప్రారంభించ దలచిరి. పూజ్య శ్రీ మాతాజీ వారి సూచనల మేరకు "శ్రీకాళీప్రసాద ఆశ్రితాశ్రయము" అనే పేరు పెట్టారు. ఆ ఆశ్రమాన్ని ది. 29-4-2017, శనివారము ఉదయము 11 గంటలకు శ్రీ మాతాజీ వారు తమ కర కమలములతో ప్రారంభించారు. అక్కడి ఆలయ ప్రాంగణంలో నూతన వసతులతో సంకల్పించిన ఒక వృద్ధాశ్రమ భవనానికి కూడా శ్రీమాతాజీవారు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంలోశ్రీమాతాజీ వారు ప్రసంగిస్తూ," ఎవరికి వారు తమ పనులను చేసికొవటం పరిపాటే. కాని సేవాభావంతో ఒక సంస్థను ప్రారంభించి దీక్షగా దానిని నడపటం విశేషం. భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని వారు వినియోగించుకొని నిస్స్వార్థంగా ఈ వృద్ధాశ్రమాన్ని నడపటానికి కంకణం కట్టుకొని ఆశ్రయించివారికి ఆశ్రయం కల్పిస్తున్నారు.

నిజమైన త్యాగమే అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. ఇటువంటి సేవలను కార్యకర్తలు అందిస్తున్నారు. వారి సేవలతో ఈ వృద్ధాశ్రమం ఎంతోమందికి ఆశ్రయం కల్పిస్తుంది. వారి సేవలు ఎప్పటికీ ప్రకాశిస్తుంటాయి. అటువంటి శక్తిని, భక్తిని, సేవాతత్పరతను శ్రీగురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ!"

(గత సంచిక తరువాయి) - జపమాల ప్రసాద

# అమ్మ మాట

## భజగోవిందమ్ మూఢమతే! -3

**"కాతే కాంతా ధనగత చింతా**

**వాతుల కిం తవ నాస్తి నియంతా**

**త్రిజగతి సజ్జన సంగతి రేకా**

**భవతి భవార్ణవ తరణే నౌకా"**



"ఓరీ మూఢమతీ! ఎందుకురా నీవు నిరంతరం కాంతా కనకములనే విషయములందే రమిస్తూ, నీ కాలాన్నంతా వ్యర్థం చేసుకుంటున్నావు? నీకు సన్మార్గాన్ని చూపించే వారెవరూ లేరా? లేకేమి? మూడు లోకాలలోనూ కేవలం సజ్జన సాంగత్యమనే నౌక మాత్రమే నిన్ను రక్షించగలదు. అది ఒక్కటే నిన్ను యీ జనన మరణములనే సంసార సాగరం నుండి దాటించి కాపాడగలదు. కనుక, యిప్పటికయినా త్వరపడి సత్సాంగత్యమనే నౌకని ఆశ్రయించు" అని చెప్తున్నారు శ్రీ ఆదిశంకరులు.

ఈ ప్రపంచం ఒక మహారణ్యం. అదే 'అవిద్య' అనే అరణ్యం. ఈ అవిద్యాఽరణ్యంలో నుండి బయటపడటం ఒక్కరి వల్ల సాధ్యం కాదు. ఈ అరణ్యంలో ఒక ప్రక్కనుండి కామక్రోధాదులనే పులుల గాండ్రింపులు. పైనుండి మోహమనే కొండచిలువ కబళించడానికై మనమీద పడటానికి చూస్తూ వుంటుంది. మదమనే ఏనుగు మనవైపు పరుగుపరుగున వస్తూ వుంటుంది. లోభమనే గుంటనక్కలు, మాత్సర్యమనే తోడేళ్ళు మనని కబళించడానికి చూస్తూ వుంటాయి. ఇక మనని రక్షించేది ఎవరు? ఒక దానిని తప్పించుకోవాలని చూస్తే, మరొకటి వెనువెంటనే వస్తూవుంటే

మనమేమి  చేయాలి?

అటువంటి దిక్కుతోచని పరిస్థితిలో మనకు సహాయపడేది కేవలం సజ్జన సాంగత్యం మాత్రమే. సజ్జన సాంగత్యం గురువాక్యమే. శ్రీ సద్గురుదేవులు మనకి చెప్పిన చిట్కా ఏమిటీ అంటే, ఈ అవిద్య అనే అరణ్యానికి ధ్యానమనే అగ్నిని అంటిస్తే, మనలని బాధించే ఆ కామక్రోధాది జంతువులన్నీ ఒకేసారి పలాయనం చిత్తగిస్తాయని శ్రీబాబూజీమహరాజ్  వారు  చెప్పారు.

ఇక్కడ శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు ఈ ప్రపంచాన్ని ఒక మహాసాగరంగా చెప్పారు. నడి సముద్రంలోకి వెళ్లాక, మునిగిపోతూ వుంటే మనకి రక్షణ ఎవరు? నీ బ్యాంకు డిపాజిట్లా? నీ లాకర్‌లోని నగలా? లేక బ్యాంకు బాలెన్స్‌లా? ఆ క్షణంలో ఆంజనేయు స్వామో, లేక నీవు నమ్ముకున్న దేవతామూర్తియో నీకు గుర్తువచ్చి తీరుతాడు. దిక్కు తోచని మనకు ఎటువెళ్ళాలో దిక్కును తెలిపే దిక్సూచి కావాలి. దిక్సూచి ఎప్పుడూ ఉత్తర దిక్కునే చూపిస్తుంది. ఆధ్యాత్మికంగా ఉత్తర దిక్కు జ్ఞానానికి సంకేతం. కనుక మనకి జ్ఞానమార్గాన్ని చూపించే దిక్సూచి పరమాత్మ. దిక్సూచి మనని తీరానికి చేర్చటం లేదు. కానీ, అది మనం ఎటు వెళితే తీరానికి చేరుకుంటామో చెప్తుంది. కనుక, దాని మాటవిని, అది సూచించిన బాటలో ప్రయాణం చేస్తే మనం రక్షింప  బడతాము.

మానవుడు నిరంతరం కామినీ కాంచనాలకు బానిసయిపోయి, జీవితాన్ని  పాడు చేసుకుంటున్నాడు. ఎంతసేపూ మనసు విషయాదుల వెంట వెళ్ళి తీరుతుంది. ఇటువంటప్పుడు 'సజ్జనసాంగత్యం' అనే నౌక ఒక్కటి మాత్రమే మనని యీ కామినీ, కాంచనాల నుండి రక్షిస్తుంది.

-సశేషం

# సాధనలో అవాంతరాలు

- శ్రీరామకృష్ణులు

పిరికితనం, ద్వేషం, భయమూ, రాజ్యమేలే చోట భగవంతుడు గోచరించడు.

తక్కెడలోని బరువైన సిబ్బి క్రిందికి పోగా, తేలికైనది పైకి లేస్తుంది. అలాగే తాపత్రయ భారంతో కుంగిపోయే వ్యక్తి సంసారంలో మునిగిపోతూంటే, అంతటి తాపత్రయమూ, ఉబలాటమూ లేని వ్యక్తి భగవత్పాదరవిందాలను ఆశ్రయించి ఉన్నతిని పొందుతాడు.



ఇతరుల గుణగణాలను గురించి చర్చిస్తూ కాలం గడిపే వ్యక్తి జీవితం వ్యర్థమైపోతుంది. ఎందుకంటె అతడి కాలం ఆత్మచింతన లోగాని, పరమాత్మ చింతనలోగాని వినియోగపడటం లేదు. పైగా యితరుల మంచి చెడులు విమర్శించటంలో వ్యర్థమై పోతోంది.

మనస్సు ప్రశాంతంగా వున్నప్పుడు భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. మనస్సనే సరస్సును కోరికలనే గాడ్పులు కల్లోల పరుస్తుంటే అందులో దేవుడి ప్రతిబింబం గోచరించదు. భగవత్సాక్షాత్కారం అలాటి పరిస్థితులలో అసంభవం.

కడుపు నిండి వున్నా, అజీర్తితో బాధపడుతున్నా కూడా కమ్మని పిండివంటలు, ఊరగాయలు చూడగానే ఎవరికైనా నోరూరుతుంది. ఒకడిలో అణుమాత్రం లోభిత్వం లేకపోవచ్చు, పరమపవిత్ర భావాలు వుండవచ్చు; అయినా సంపద, యితర కామ్యార్థాలు కంటపడగానే అతడి మనస్సు రెపరెపలాడుతుంది సుమా!

నూతిలోని కప్పలా వుండవద్దు. నూతిలోని కప్పకు నుయ్యే దాని ప్రపంచం. నూతి కంటె పెద్దదిగాని, గొప్పదిగాని దానికి మరేదీ గోచరించదు. దీనినే **'కూపస్థ మండూక న్యాయం'** అంటారు. అలాగే అందరూ సర్వమత దురభిమానులే. తమ మతం కంటె సంప్రదాయంకంటె గొప్పదీ ఉత్తమమైనదేదీ వారికి కనబడదు.

# ఓం జ్ఞాన నేత్ర ప్రదాయకాయ నమః

- పాలూరి కాళీప్రసాద్

మనందరికీ మనం శివుడి నుండే వచ్చామని తెలుసు. అలాగే మనలోనే ఆ శివుడున్నాడనీ తెలుసు. కానీ మనం మాత్రం శవాలుగానే మిగిలి పోతున్నాము. ఏమిటి దీనికి కారణం? ఆ శివునిలో ఉన్నది, మనలో లేనిది ఏమిటని ఆలోచిస్తే ఆయనకు మనకన్నా ఎక్కువగా ఉన్నది మూడవ కన్ను. అదే జ్ఞాన నేత్రం. ఆ కన్ను ఒక్కసారి తెరచుకున్నదంటే ఇక జాతి, నీతి, కుల, గోత్ర, నామ, రూప, గుణ దోషం, దేశ కాలాలు ఇలా మనం పెట్టుకున్న విశేషణాలన్నీ కాలి బూడిద అయిపోయి, విభూతి (భగవంతుని వైభవం) ఒక్కటే మిగులుతుంది.



నశ్వరమైన ఈ దేహమే నేనని భావించేవాడికి మృత్యువుకానీ, సర్వవ్యాపకమై, నిత్యమైన ఆత్మ వస్తువును నేనని తెలుసుకున్న వాడికి ఇక చావు పుట్టుకలెక్కడివి? అటువంటి జ్ఞాననేత్రాన్ని మనకు ప్రసాదించ డానికి స్వయంగా మళ్ళీ ఆ సదాశివుడే సద్గురు రూపం ధరించి మాటిమాటికి మన మధ్యకు వచ్చి, మనతోనే ఉండి, మనలోనే ఉన్న శివుడిని దర్శింపజేసే జగత్తు అంతా శివమయమే అన్న ఆరూఢమైన జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తారు.

మనకు కనిపించే ఈ ప్రపంచంలో మనం అగ్నిని, జలాన్ని మనం అన్నిటికంటే పవిత్రమైనవిగా భావిస్తాము. ఎటువంటి మలినాలనైనా సరే అగ్ని కాల్చివేసి స్వచ్ఛమైన విభూతిగా మార్చివేస్తుంది. అలాగే మురికి కాల్వలో నీళ్లైనా గంగానదిలో కలవగానే పవిత్రమౌతుంది.

కాని భగవద్గీతలో స్వామి 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే' - జ్ఞానంతో సరిపోల్చగల పవిత్ర వస్తువు మరేదీలేదు అని స్పష్టంగా చెప్పారు. అట్టి జ్ఞానాన్ని ప్రసాదించే పరశివ స్వరూపులైన శ్రీగురుదేవులకు సహస్ర వందనాలు!!

# అంజలి

- కరుణ శ్రీ

సీ ॥ పుట్టబోయెడి బుల్లి బుజ్జాయి కోసమై
పాదుగు గిన్నెకు పాలు పోసి పోసి

కలికి వెన్నెలలూరు చలువ దోసిళ్ళతో
లతలకుమారాకులతికియతికి

తెల్లవారకుండ మొగ్గల లోన జొరబడి
వింత వింతల రంగులు వేసి వేసి

పూల కంచాలలో రోలంబులకు రే
పటి భోజనముసిద్ధ పరచి పరచి

తే.గీ॥ తీరికేలేని విశ్వ సంసారమందు
అలసిపోయితివేమొ దేవాదిదేవ
ఒకనిమేషమ్ము కన్ను మూటుదువుగాని
రమ్ము! తెరచితి నా కుటీరమ్ము తలుపు॥



# అక్కా – బావా!

- నారాయణ రెడ్డి

ఇంకా శివరాత్రి పదిరోజులున్నదనగానే, భక్తులు చీమల బారుల్లా శ్రీశైల మహాక్షేత్రానికి వెడుతున్నారు. దారిలోని గ్రామస్థులు వీరికి ఆతిథ్యం ఇచ్చి ఆదరిస్తున్నారు.

ఒక గ్రామంలోని ఒక బాలుడు ఈ భక్తబృందాన్ని ఎంతో ఆనందంగా తిలకించి, "ఎక్కడకి వెడుతున్నారు?" అని ప్రశ్నించాడు. "ఇంకెక్కడికి శ్రీగిరి పర్వతానికి. మల్లిఖార్జునుణ్ణి- భ్రమరాంబను దర్శించ డానికి" అని జవాబు చెప్పారు. "అయితే నేనూ వస్తాను పదండి" అన్నాడు.

"నువ్వా! ఈ అరణ్యం గుండా నడచి రాలేవు" అని పెద్దలందరూ వారించారు. " నేను ఆ దంపతులిద్దరినీ పట్టుకుని మా యింటికి తీసుకువస్తాను" అంటూ శపథం చేశాడు ఆ బాలుడు. భక్తులంతా పరిహాసం చేశారు. "అవును! మా అక్క భ్రమరాంబిక, మా బావ మల్లికార్జునుడని చిన్నప్పుడు నాకు మా అమ్మ చెప్పింది" అన్నాడు దృఢ విశ్వాసంగా. బాలుడు ఆ భక్తబృందంతో కలిసి శ్రీశైలం చేరాడు.



భక్తులంతా 'శివుడు తాండవ మాడెనే ...' అంటూ ఆనంద తాండవం చేస్తున్నారు. ఆ సదాశివుడు ఈ బాలుని గుండెల్లో ఆనంద తాండవమాడుతున్నాడు.

"ఎక్కడున్నారు మా అక్కా, బావా?" అంటూ గుడి అంతా పరుగులు తీస్తున్నాడీ బాలుడు. మల్లికార్జుని గుడిలో శివలింగాన్ని చూసి, "నాతో మాట్లాడవలసి వస్తుందని, నాతో మా యింటికి రావలసి వస్తుందని బావా! ఇలా రాయిలాగ మారిపోయావా? సరే ఎలా రావో

నేనూ చూస్తాను! నీ వేషాలు నా ముందరా? ఉండు! మా అక్కను తీసుకు వస్తాను!" అంటూ భ్రమరాంబాలయానికి వెళ్ళాడు.

జగజ్జనని, సర్వమంగళ సర్వాభరణ శోభితగా కనబడింది. బాలుడు ఉత్సాహంగా "అక్కా! నీవు ఇక్కడ ఉన్నావా? ఓహో! ఏమీ నీ అందం! ఎన్ని ఆభరణాలు! పాపం! బావ ఏ ఆభరణాలు లేకుండా రాయి మాదిరిలా ఉన్నాడు. పోనీ బావకు ఒక్క ఆభరణం అయినా యివ్వక పోయావా? పోనీలే! అవన్నీ తరువాత మాట్లాడుకుందాం. ముందు మన యింటికి పదండి బావా నువ్వూ. అమ్మతో చెప్పి మీకు పప్పలు వండించి పెడతాను" అంటూ తొందరపెట్ట సాగాడు. జగదీశ్వరి ఉలకలేదు పలుక లేదు. విగ్రహం మాదిరిగానే ఉండిపోయింది.

బాలుడు అక్కా, బావలను ఒప్పించడానికి అటు మల్లికార్జునుడి గుడికి, ఇటు భ్రమరాంబిక గుడికి పరుగులు తీస్తున్నాడు, ఏడుస్తున్నాడు, ప్రాధేయపడుతున్నాడు. తిరగబడుతున్నాడు, తిడుతున్నాడు. ఈ అస్త్రాలన్నీ విఫలమయ్యాయి. కానీ ఆ అది దంపతుల మతులలో చలనం కలుగ లేదు. భక్తులందరూ ఇతనికి పిచ్చెక్కిందనే నిర్ణయానికి వచ్చారు.

"మా అక్కా బావలను తీసుకెళ్ళకుండా ఇంటికెలా వెళ్ళను? మా అమ్మ ముఖం ఎలా చూడను? ఇక్కడే నా ప్రాణాలు అంతం చేస్తాను" అంటూ శ్రీశైల పర్వతం మీద నుండి క్రింద అగాధంలోకి 'ఓం నమశ్శివాయ' అంటూ దూకేశాడు.

అద్భుతం! బాలుడు పరమేశ్వరుని హస్తాలలో భద్రంగా వున్నాడు. ప్రక్కనే జగదాంబ దరహాసపు కాంతులతో నిలబడి వున్నది. "ఇదే మిమ్మల్ని పట్టుకునే మార్గం! ఇదే అసలు రహస్యం! సరే పదండి మన ఇంటికి వెడదాం" అన్నాడు బాలుడు పెన్నిధి దొరికిన ఉత్సాహంతో.

"సరే పద!" అన్నారు ఆ ఆది దంపతులు. "నేను అడుగు తీసి అడుగు పెట్టలేను. బావా! నన్ను నీ భుజాల మీదకి ఎత్తుకో!" అన్నాడు ఆ బాలుడు తన పగిలిన పాదాలను చూపిస్తూ మల్లికార్జునుడిని. చిట్టి బావమరిదిని భుజాలమీద ఎక్కించుకుని, భ్రమరాంబికను తీసుకుని, భక్తబృందంతో కలిసి మల్లికార్జునుడు వస్తున్నాడు. ఆ దంపతలను చూసి పార్వతీ పరమేశ్వరులే ఈ రూపంలో వస్తున్నారా! అంటూ విస్తుపోయారు

ఆ ఊరి ప్రజలు.

ఆ ఊరి చివర విగ్రహాలు లేని ఒక శిథిల శివాలయం చూపిస్తూ మేము ఇక్కడ ఉంటాము. నీవు మీ యింటికి వెళ్ళు అన్నారు ఆ ఆది దంపతలు. కాదు మా యింటికి రావలసినదే అని పట్టుపట్టాడు. ఆ ఇంటి అరుగు మీద ఆ ఆది దంపతులు కూర్చున్నారు. బాలుడు వాళ్ళ అమ్మతో అప్పచ్చులు చేయించి ఆ దంపతులకిచ్చి, 'మీరిక్కడే కూర్చోండి. నేను నా తోటి పిల్లలను తీసుకువస్తాను' అని చెప్పి పరుగెత్తాడు.

పిల్లల జట్టుతో వచ్చిన ఆ బాలుడు ఆ అరుగు శూన్యంగా వుండటం చూసి, అతని హృదయం శూన్యమైపోయింది. 'అక్కా బావలను ఎందుకు పోనిచ్చావు?' అంటూ తల్లి మీద పోట్లాడాడు. ఏడ్చాడు.

ఊరి చివర విగ్రహాలు లేని శిథిలాయంలో భ్రమరాంబిక, మల్లికార్జునుల విగ్రహాలను చూసి, ఆ బాలుడు "ఓ మీరిక్కడ మళ్ళీ మీ పూర్వపు రూపాలను ధరించారా! ఎంత మోసం! వచ్చినట్లే వచ్చి, మళ్ళీ ఇలా అవుతారా!" అంటూ గుండెలు బాదుకుని ఆక్రోశించాడు.

ఆకాశవాణి పలికింది "వత్సా! మేము ఇక్కడ అక్కా బావల క్రింద ఎప్పుడూ ఉంటాం. నీవు పెట్టింది తింటాం" అని.

అప్పుడు ఆ బాలుడు ప్రశాంతంగా ఆనంద మేఘాలలో తేలియాడుతూ యింటికి తిరిగి వచ్చాడు. తల్లి మహదానందంతో పరుగెత్తుకుంటూ ఎదురువచ్చి "ఆశ్చర్యం! మన ఇల్లంతా బంగారు మయమయింది. అష్ట ఐశ్వర్యాలు మనలను వరించాయి" అంది.

"అమ్మా! మన ఇంటికి వచ్చింది మామూలు అక్కా బావా కాదు. సాక్షాత్ ఆ పార్వతీ పరమేశ్వరులే!" అన్నాడా బాలుడు ఆనందంతో.

ఆ బాలుడు జీవితాంతం ఆ మల్లికార్జున భ్రమరాంబికలను అర్చిస్తూ గడిపాడు. ఆ బాలుడే సిద్ధరామయోగిగా ప్రసిద్ధికెక్కాడు. సిద్ధ రామయోగి శివలోకం వెళ్ళి పార్వతీపరమేశ్వరులతో మాట్లాడి తిరిగి భూలోకానికి వస్తూ వుంటాడని అతని మహిమలు కథలు కథలుగా చెప్పుకుంటూ వుంటారు.

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

# త్రిపురా రహస్యం

## జ్ఞాన ఖండం

శ్రద్ధతో పురుష ప్రయత్నం చేసేవాడెన్నడూ విఫలుడు కాడు. పౌరుషం వల్లనే కర్షకులు ధాన్యాన్ని, రాజులు రాజ్యాన్ని, విప్రులు విద్యను, తపస్వులు ఉత్తమలోకాలనూ పొందుతున్నారు.

దేనిని పొందిన తరువాత దుఃఖం రాదో అది ప్రేయస్సు. శ్రేయస్సు ఈశ్వరానుగ్రహం లేనిదే ఫలించదు. ఏదేది సావయమో అది కార్యం. జగత్తు సావయవము. అందుచేత దానికి ఒక కర్త ఉండాలి. ఏవేవి వేద్యములో (తెలియబడునో) అవి అన్నీ కార్యాలే. ***యత్ యత్ వేద్యం తత్తత్ కార్యం।*** ఆకాశానికి పరమాణువులు వేద్యములు.



సృష్టికి ముందు, ***నాఽ సదా సీత్, నో సదాసీత్ తమ ఆసీత్।*** సత్తూ లేదు, అసత్తూ లేదు. చీకటి ఉంది.

జనన మరణాది రూపమైన సంసారం దుఃఖానికి హేతువనీ, సుఖ దుఃఖాలు లేని స్వస్వరూపానుభవమే మోక్షమని, అందువలన, అది పరమ పురుషార్థమని ఆగమాలు చెబుతున్నాయి. దర్పణంలో సూర్య కాంతి ప్రతిబింబించినప్పుడు ఆ వెలుగు ఘటాది దృశ్యాలను ప్రకాశింపజేస్తుంది. అలాగే ప్రకృతిలో ప్రతిబింబితమైన చిత్తు చిద్రూపంగా ఉంటుంది.

మనం నిష్కామంగా ప్రేమిస్తే, లోకంలోని సామాన్య ప్రభువులకే అనుగ్రహం కలుగుతుంది. ఇక సర్వలోకేశ్వరుడైన ఈశ్వరుడిని మనోవాక్కాయ కర్మలతో ఏ ఫలాన్నీ కోరకుండా ఆరాధిస్తే మనకు అన్ని

శ్రేయస్సులూ కలుగుతాయి.
ప్రశ్న: మహేశ్వరుడు ఆప్త కాముడు కదా! అతనికి మన సేవల వలన పని లేదు. అటువంటప్పుడు మహేశ్వరుడు మనకు శ్రేయస్సును ఎలా సమకూర్చుతాడు?
సమాధానం: మహేశ్వరుడు భక్త వత్సలుడు. అందువలన తనను ఉపాసించినవారి కోర్కెలను తప్పక తీరుస్తాడు. ఉపాసన అనేక విధాలుగా ఉంటుంది. ఒకడు తన బాధలు తీరటానికి ఉపాసిస్తాడు. మరొకడు ధనంకోసం ఉపాసన చేస్తాడు. నిష్కామంగా చేసేదే నిజమైన ఉపాసన.
ప్రశ్న: గురి చూసి వదలిన బాణంలాగా ప్రారబ్ధ కర్మను తప్పుకొనలేము అని ఆగమాలుచెబుతున్నాయి కదా! మరి ఈశ్వరుడు ఏమి చేస్తాడు?
సమాధానం : మహేశ్వరుని యందు నిష్కామ భక్తి లేనివారి విషయంలో వర్తిస్తుంది. పరమ భక్తుడైన మార్కండేయుని విషయంలో ఈశ్వరుడు అతని ప్రారబ్ధ కర్మను చూడలేదు. ఎందుకంటే, పరమేశ్వరుని శరణు పొందిన వారికి ఈ నియమం వర్తించదు. కావున కుతర్కాన్ని వదలి నిష్కామంగా ఈశ్వరుని అశ్రయించు. అది నీకు శ్రేయస్సును కలుగజేస్తుంది.
హేమచూడుడు: సర్వకర్త, సర్వస్వతంత్రుడు అయిన మహేశ్వరుడు ఒకడున్నాడని చెప్పావు. గణేశుడు,శివుడు,సూర్యుడు మున్నగువారిలో ఎవరిని ఈశ్వరునిగా గ్రహించాలి?
హేమలేఖ: సర్వ జగత్తును సృష్టించి,రక్షించి సంహారం చేసేవాడే ఈశ్వరుడు అని అన్నారు. అతడు విష్ణువు, శివుడు, బ్రహ్మ, సూర్యుడు, చంద్రుడు. వాస్తవానికి అతడే సర్వమూ అయినవాడు. అందువల్ల చేతనయే ఈశ్వరుడు. పరాచితి (పరాశక్తి) ఆయనకు శరీరం. ఆ చితియే మహాసత్త. ఆమెయే త్రిపుర. ఆమెలోనే ఆమెకంటె భిన్నంకాని ఈ జగత్తు భాసిస్తోంది. అందువలన ప్రాజ్ఞుడైనవాడు ఆ రూపాన్ని నిష్కామంగా ఉపాసించాలి. అప్పుడు సర్వోత్తమమైన శ్రేయస్సు కలుగుతుంది.

-సశేషం

# కామేపల్లిలో విజయవంతంగా ముగిసిన మహామృత్యుంజయ మహాయాగము



ది.03.02.2017నుండి 22.5.2017 వరకు కామేపల్లిలోశ్రీ మహామృత్యుంజయ జప ఉర్వారుక విశ్వశాంతి మహాయాగము, అఖండ శివనామ, రామనామ సంకీర్తన మహాయజ్ఞము- కోటి కుంకుమార్తన, కోటి బిల్వార్చనలతో 108 రోజులుగా జరిగినది.

ఈ యాగ పూర్ణాహుతి కార్యక్రమము కొరకు శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగిని చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు ది.21.05.2017నఅచటకు చేరి, అనుగ్రహభాషణము చేసి తమ దివ్యాశీస్సులను అందజేశారు. శ్రీ మాతాజీ యాగ కార్యకర్తల అకుంఠిత దీక్షను ఎంతో ప్రశంసించారు. విశ్వశాంతి కొరకు జరుగుతున్న ఈ యాగం సత్ఫలితాలను తప్పక అందిస్తుంది అని అన్నారు. ముఖ్యంగా ఈ యాగం నిర్విఘ్నంగా సాగటానికి మూల కారుకుడైన శ్రీ శివాజీ చేసిన నిర్విరామ సేవలను కొనియాడారు.

ది.22.05.2017న యాగ పూర్ణాహుతి కార్యక్రమం శ్రీ మాతాజీవారు జరిపి అచటకు విచ్చేసిన అసంఖ్యాకమైన భక్తులకు తమ దివ్యాశీస్సులను అందించారు.

# త్యాగమయులు సుమిత్ర – ఊర్మిళలు

- గాలి జగదీశ్

లక్ష్మణుడు, శ్రీసీతారాముల వెంట అరణ్యవాసానికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని ఊర్మిళకు తెలియజేయడానికి ఆమె గదిలోకి వెళ్ళి "ఊర్మిళా! సీతారాములు వనాలకు వెడుతున్నారు. వారికి సేవ చేయడానికి నేను కూడా వారి వెంట వెడుతున్నాను. ఇక పద్నాలుగు సంవత్సరాలవరకు నేను నీకు మళ్ళా కనబడను" అన్నాడు.

ఊర్మిళ నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది. నేత్రాలు మేఘరూపం ధరించి, వర్షించాయి. తనవెంట అడవికి రమ్మనమని లక్ష్మణుడు పిలవనూ లేదూ, ఊర్మిళ వస్తానని అననూ లేదు. సేవ చేయడానికి వెడుతున్నానని లక్ష్మణుడు అన్న వాక్యము ఊర్మిళ గొంతుకు అడ్డంపడి మాటలను బహిర్గతం కాకుండా ఆపింది.

"ప్రభూ! నేను అయోధ్యలోనే వుంటాను. సీతారాములను మీరు శ్రద్ధా భక్తులతో సేవించండి. కానీ నాదొక మనవి. ఈ పద్నాలగు సంవత్సరాలలో ఏ ఒక్క క్షణం కూడా నేను మీకు జ్ఞాపకం రాకూడదు. మీరు సీతారాముల సేవ అనే తపస్సులో వుంటారు. పతి తపస్సుకు సతి అడ్డుకాకూడదు. నా వల్ల వ్రతభంగం కాకూడదు. కనుక నన్ను ఒక్క క్షణం కూడా మీ మనస్సులోకి రానివ్వకండి.

నాథా! వచ్చినా కూడా ప్రయోజనం ఏమున్నది? మీరక్కడ! నేనిక్కడ! నదిలో సుడిగాలిలాగ మనస్సులో సంకల్ప సుడిగుండాన్ని సృష్టించుకోవటమే గాని, మరొక ప్రయోజనం లేదు. తపస్సులో సంకల్పం నిరోధం సాధించాలేగాని, సంకల్పం ద్వారా తపస్సు నిరోధింపబడకూడదు. నా వల్ల మీ సాధన భగ్నం కాకూడదు. మీరు అదృష్టవంతులు. తృప్తిగా సీతారాముల సేవ చేసుకోండి" అన్నది త్యాగమయి ఊర్మిళ.

మరొక సంఘటనలో రామరావణుల మధ్య భయంకరంగా పోరాటం సాగుతోంది. లక్ష్మణుడు మూర్ఛిల్లాడు. హనుమంతుడు సంజీవిని పర్వతాన్ని తీసుకువస్తున్నాడు. హనుమ నందిగ్రామ ప్రాంతానికి రాగానే భరతుడు రాక్షసుడేమో అని భావించి, బాణ ప్రయోగం చేసి పర్వతంతో సహా హనుమంతుడిని క్రిందకు దింపాడు.

రాణులు, ప్రజలందరూ చుట్టూ మూగి హనుమను దర్శించారు. లక్ష్మణుని మూర్ఛవార్త విని అందరూ రోదించారు. ఆ సమయంలో దుఃఖించకుండా ధైర్యంగా ఉన్నది ఇద్దరే ఇద్దరు! వారే సుమిత్ర, ఊర్మిళ. రోదిస్తున్న కౌసల్యతో "అక్కా! దుఃఖించకు. ధర్మాత్ముడైన రామునికి ఏ

ఆపదా రాదు. ఒకవేళ నా బిడ్డ లక్ష్మణుడు మరణిస్తే, నా రెండవ బిడ్డ శత్రుఘ్నుని రామునికి అండగా నేను వనాలకు పంపిస్తాను" అని ఊర్మిళ చెప్పగానే కౌసల్య తన చేతులతో సుమిత్రను గాఢంగా హృదయానికి హత్తుకుంటుంది.

త్యాగమయి సుమిత్ర మాటలు విని హనుమంతుడు నిశ్చేష్టుడు అయ్యాడు! ఊర్మిళ మందిరానికి వెళ్ళి ఈ విషయం తెలుపగానే, "హనుమా! నా భర్త గురించి నాకు బాగా తెలుసు. నా నాధుని శరీరంలో ప్రతి అణువూ మంత్రపూతమే. రాముడు తప్ప రెండవ వస్తువు తెలియదు. ఆయన రోమరోమంలోనూ రామనామమే నిండి వుంటుంది. శత్రువులు వేసే బాణాలు రోమరోమంలో నిండి ఉన్న రామునికే తగులుతాయిగాని, నా భర్తను బాధించవు. అదలా వుంచు. ఇంతకీ లంకలో ఇప్పుడు ఏమి జరుగుతోంది?" అన్నది.

హనుమ "అమ్మా! లక్ష్మణుడు మూర్ఛపోయాడు, రాముడు ప్రక్కనే కూర్చుని రోదిస్తున్నాడు." అన్నాడు.

"చూశావా! హనుమా! అర్థమయిందా? బాణాలు తగలటం వల్ల రాముడు రోదిస్తున్నాడు. బాణాలు స్పృశించనందు వలన నా భర్త హాయిగా నిదురిస్తున్నాడు. రాముని శరణాగతుడైన నా భర్తను రాక్షసుల శరాలు ఏమీ చేయలేవు" అన్నది ఊర్మిళ.

ఊర్మిళ మాటలను విన్న హనుమంతుడు కన్నీళ్ళను ఆపుకోలేక పోయాడు. "ఆహా! ఏమీ రఘుకులం యొక్క వైభవము! ఈనాడు ఈ పవిత్రాంతఃకరణలను చూసిన నా జీవితం ధన్యం!" అనుకున్నాడు.

"తల్లీ! నాకు అనుజ్ఞ ఇస్తే తెల్లవారే సరికి నేను ఈ సంజీవిని తీసుకుని రామలక్ష్మణులను సమీపించాలి. లేకపోతే ప్రమాదం ముంచుకు వస్తుంది" అన్నాడు హనుమంతుడు.

"హనుమా! ఆవేదన చెందకు. దశరథుని కోడలను, జనకుని కూతురనైన ఊర్మిళను చెబుతున్నాను. నీవు వెళ్ళి, నా భర్త స్పృహలోకి వచ్చేవరకు సూర్యోదయం కాజాలదు! రఘుకులానికి మూలపురుషుడు సూర్యుడు. తాను ఉదయించటం వలన తన సంతానం అస్తమిస్తాడని తెలిసి సూర్యుడెలా ఉదయిస్తాడు? భీతి చెందకు. నీ పని పూర్తి అయిన తరువాతనే సూర్యుడు ఉదయిస్తాడు!" అని చెప్పగానే హనుమంతుడు కన్నీళ్ళతో ఆమెకు నమస్కరించి బయలుదేరాడు.

# క్రీస్తు ఆస్తిక్య బుద్ధి

సేకరణ - మురళీ

(వార్తాలాపము నుండి)

నీవు నీ జీవితం గురించి ఏమీ బాధపడటం లేదు. కాబట్టి ఏది తినాలి, ఏది త్రాగాలి, ఏది ధరించాలి ... ఇటువంటి విషయాల గురించి చింతించవలసిన అవసరం లేదు. ఆహారాదుల కంటె జీవితం ఎక్కువ విలువైనది కాదా?



ఆకాశంలో ఎగిరే పక్షులను చూడు! అవి ధాన్యం నాటడం లేదు, కోయటం లేదు, నిలువచేయటం లేదు. అయినా పరమాత్మ వానికి అన్నపానాదులను సమకూరుస్తూనే వున్నాడు. ఆ పక్షుల కంటె నీవు గొప్పవాడవే కదా!

తోటలో పెరిగిన లిల్లీ పుష్పాన్ని చూడు! అది ఎలా పెరిగినది? అది ఏమీ చేయటం లేదు. అయినా వాడిపోవటం లేదు. దేవునిపై నమ్మకం లేనివారలారా! అదిగో చూడండి! పరమాత్ముడు అడవిలోని గడ్డిని కూడా రక్షిస్తున్నాడు. మిమ్మల్ని రక్షించలేడా? కాబట్టి నేను ఏమి తినాలి? ఏమి ధరించాలి? అనే ఆలోచనలను మానవుడు కలిగివుండ రాదు. ప్రాపంచిక జనులు ఎప్పుడూ ఈ వస్తువుల గురించే బాధపడుతూ వుంటారు. నీకు ఏ ఏ వస్తువులు కావాలో ఆ పరమాత్మకు తెలుసు.

ముందు నీవు ప్రభువు యొక్క రాజ్యమును, సత్యప్రియత్వము గురించి శోధించి తెలుసుకో. అప్పుడు నీకు కావలసిన వస్తువులన్నీ వాటంతట అవే లభిస్తాయి. కాబట్టి రేపటి గురించి ఆలోచించకు. రేపు వస్తే అదే అన్ని వస్తువుల గురించి చూసుకుంటుంది.

క్లుప్తంగా చెప్పాలంటే మీరు నాస్తికులే. మీకు ప్రభువుపై నమ్మకం లేదు. అందుకే రేపటి గురించి ఆలోచిస్తున్నారు మీరు.

# ముండకోపనిషత్తు

- రమణ ప్రసాద్

జ్ఞానం రెండు విధాలు - లోక జ్ఞానం, బ్రహ్మజ్ఞానం. ప్రత్యక్షంగా కనిపించేది లోకం. ప్రత్యక్షంగా కనిపించకపోయినా పరోక్షంగా ఉండేది బ్రహ్మమే. లోకం క్షరం. బ్రహ్మ అక్షరం. అక్షరమైన బ్రహ్మనుండే క్షరణశీలమైన చరాచర జగత్తు జనించింది. ఈ జగత్తును ప్రసవించి, పాలించి, పోషించి లయింపచేసుకునేది కూడా అక్షరమే. ప్రధాన తత్త్వమైన ఈ అక్షర పరబ్రహ్మ గురించి చెప్పటం వల్ల దీనికి ముండకమని పేరు వచ్చింది. ఇది అధర్వవేదంలోనిది. ఆత్మ తత్త్వమే బ్రహ్మ పదార్థమని తెలుసుకోవటానికి మూడు సోపానాలు ఉన్నాయి భావన, సాధన, ఉపాసన ఈ ఉపనిషత్తు.

ఓం భద్రం కర్ణేభి శృణుయామదేవాః

భద్రం పశ్యేమాక్షభిర్య జత్రాః ........ స్వస్తినో బృహస్పతిర్దధాతు ॥ ఓం శాంతిఃశాంతిఃశాంతిః ॥అనే శాంతి మంత్రంతో ప్రారంభమవుతుంది.

" ఓ దేవతలారా! మేము చెవులతో శుభప్రదమైనదానిని విందుము గాక! మేము కళ్లతో శుభప్రదమైనదానిని చూతుముగాక! మీ స్తోత్రాలను గానం చేస్తూ నియమితమైన ఆయుఃకాలాన్ని, పరిపూర్ణమైన ఆరోగ్యంతో బలంతో జీవింతుముగాక!

కీర్తివంతుడైన ఇంద్రుడు, సర్వజ్ఞుడైన సూర్యుడు, ఆపదలనుండి రక్షించే గరుత్మంతుడు, మా బ్రహ్మ వర్చస్సును పాలించే బృహస్పతి, మాకు శుభాన్ని కలుగజేయుగాక! ఓం శాంతిఃశాంతిఃశాంతిః ॥

ప్రథమ ముండకము - ప్రథమ ఖండము

ఓం బ్రహ్మాదేవానాం ప్రథమః సంబభూవ
విశ్వస్య కర్తా భువనస్యగోప్తా।
స బ్రహ్మవిద్యాం సర్వ విద్యా ప్రతిష్ఠామ్

అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ ॥

సృష్టి కర్త, జగద్రక్షకుడు అయిన బ్రహ్మ దేవతందరికంటే ముందు పుట్టాడు. ఆయన జగత్తుకు సృష్టికర్త, రక్షకుడు. సకల శాస్త్రాలకూ ఆధారభూతమైన బ్రహ్మవిద్యను తన జ్యేష్ఠ పుత్రుడైన అథర్వునకు అనుగ్రహించాడు.

ఈ బ్రహ్మ విద్యను అథర్వుడు అంగీరునకు బోధించాడు. ఆ విద్యను భరద్వాజ గోత్రుడైన సత్యవాహుడు అంగీరసునకు అందజేశాడు. శునక మహర్షి కుమారుడైన శౌనకుడు వినమ్రతతో అంగీరస మహర్షిని సమీపించి, "హే భగవన్!, దేనిని తెలుసుకోవటం చేత ఈ ప్రపంచం అంతా తెలుసుకోబడుతోంది.?" అని అడిగాడు.

అంగీరసుడు ఇలా బదులు పలికాడు,"పరావిద్య, అపరావిద్య అని విద్యలు రెండు ఉన్నాయి. నాలుగు వేదాలు, వేదాంగాలైన శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషమూ ఇవి అపరావిద్యలు. శాశ్వతము అమరము అయిన తత్త్వాన్ని అందించేదే పరావిద్య.

యత్ తదద్రేశ్య మగ్రాహ్యా మగోత్రమ్ అవర్ణమ్
అచక్షుః శ్రోత్రం తద పాణిపాదమ్ ।
నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం
తదవ్యయమ్ యద్ భూతయోనిం పరి పశ్యంతి ధీరాః॥

చెవులు, కళ్ళు మొదలైన జ్ఞానేంద్రియాలకు గోచరం కానిదీ, చేతులు కాళ్ళూ మొదలైన కర్మేంద్రియాలకు దొరకనిదీ. ఉత్పత్తి, రంగు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు లేనిదీ, శాశ్వతమైనదీ, అంతటా వ్యాపించినదీ, అత్యంత సూక్ష్మమైనదీ, సృష్టికి మూలకారణమైనదీ అయిన ఆ అక్షర తత్వాన్ని జ్ఞానులు సకల జగత్తుకు మూలంగా చూడగలరు.

-సశేషం

# యోగముద్రలు

- పరాశర ప్రసాద్

సాధకులకు రాజయోగము శ్రేష్ఠమైనదని సద్గురుదేవులు తరచూ చెబుతూ వుండేవారు. రాజయోగము నందు తారక యోగము, సాంఖ్యయోగము, అమనస్కయోగము అను మూడు దశలున్నాయి.

ముందుగా సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధన, ఆయన ఉపదేశించిన మంత్రరాజాన్ని ధ్యానించి మనస్సుని నియంత్రించడాన్ని తారక యోగంగా భావించవచ్చు.

తారక యోగమందు ధ్యానముద్రలో సుఖాసనములో కూర్చుని ధ్యానమునకు ఉపక్రమించాలి. తారకయోగ ధ్యానముద్రలు ఐదు రకములు వున్నాయి. అవి - 1. ఖేచరీ ముద్ర 2. భూచరీ ముద్ర 3. మధ్యమా ముద్ర 4. షణ్ముఖీ ముద్ర, 5. శాంభవీ ముద్ర.

**ఖేచరీ ముద్ర** - సాధకుడు కనులు మూసుకునిగాని, తెరచిగాని భ్రూమధ్యము అనగా రెండు కనుల నడుమ దృష్టిని నిలిపి ఊర్ధ్వముగా దృష్టిని మరలించాలి. కనులు మూసుకుని భ్రూమధ్యముల దృష్టి నిలపటం ఎలాగూ అనే సందేహం కలుగవచ్చు. కాని అది బాహ్యదృష్టి కాదని గ్రహించాలి. అది కేలవం లోదృష్టి మాత్రమే.

**భూచరీ ముద్ర** - కనులను ఎటూ కదలనీయకుండా నాసికాగ్రము నందు దృష్టిని నిలిపి ధ్యానించటవే ముఖ్యలక్షణము. నాసికాగ్రముద్రలో మనస్సు అతి త్వరగా నిశ్చల మగుటకు అవకాశం వుంటుంది.

**మధ్యమా ముద్ర** - కనులను సగం మూసి, సగం సగం తెరచి వుంచి, ముక్కు యొక్క మధ్యభాగమందు దృష్టి నిలిపి మీద నున్న నుదుటి

భాగమును వీక్షించటం ఈ ముద్ర లక్షణము.

**షణ్ముఖీ ముద్ర -** శబ్ద స్పర్శ రూప రస గంధాలకు తావివ్వక కన్నులను మూసి అజ్ఞాచక్రస్థానము నందు దృష్టి నిలిపి ధ్యానించటమే అని అర్థం చేసుకోవాలి.

**శాంభవీ ముద్ర -** ప్రాణవాయువుల గమనం నిర్దేశించి, బాహ్యేంద్రియాలు, అంతరేంద్రియాలను అదుపులో వుంచుకుని, అంతరాలలో వీక్షణ చేస్తూ ధ్యానంలో నిమగ్న మవటమే ఈ ముద్ర లక్షణముగా గ్రహించాలి.

గురూపదేశము పొందిన సాధకుడు ప్రణవము పూరిస్తూ లక్ష్యార్థ సాధన ద్వారా తప్పక తారకయోగం సాధించటానికి అవకాశం వుందసి. తారక యోగం సాధించిన తరువాత సద్గురుమూర్తి పర్యవేక్షణలో సాంఖ్య యోగము, అమనస్కయోగము సాధించటం చాలా సులభమని శాస్త్రాలు చెబుతున్నాయి.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జూన్ 2017, జులై 2017, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

జూన్ 2017: AS 7226, 7283

జులై 2017: AS 3728, 5916, 5916, 6405, 6554, 6852, 6881, 6882, 6883, AS 6884, 7134, 7285 నుండి 7297 వరకు, 7299 నుండి 7327 వరకు. వరకు

– మేనేజర్

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

- సుషమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

"జ్ఞానమొక్కటే జనన, మరణమనే భయంకర వ్యాధిని, తద్వారా వచ్చే జాడ్యములను ధ్వంసము చేయగలదు. నీవు దాని కోసమెందుకు ప్రాకులాడవు? ఓ రాజా, నీవు జీవితమంతా యిలాగే బాధాకరమైన నిష్ఠ, నియమాలను పాటిస్తూ, చెక్కలోని చెదపురుగులు చెక్కని తొలుస్తూ, వాటి జీవితాన్ని వృధా చేసుకొన్నాట్లు, 'నీ జీవితాన్ని కూడ వ్యర్థము, నిరర్థకము చేసుకొంటావా? లేక నీవు నిత్య జీవితాన్ని వుదాత్తమైన శాశ్వత శాంతి ప్రసాదించే జ్ఞానమును పొందాలను కొంటున్నావా? అశుద్ధ వాసనలకు, తిలోదకాలివ్వటం వలన అవిద్య దాని ఫలితాలు నశించి, ఆత్మ జ్ఞానమును పొంది జీవన్ముక్తుడవు కాగలవు. నియమ బద్ధమైన సత్కార్యముల వలన అశుభ వాసనలంతరిస్తాయి, అశుభ వాసనలు నశిస్తే, మనసు నిర్మాలమై, నీలో ఆత్మ జ్ఞానమును ప్రభవిస్తుంది."



అప్పుడు శిఖధ్వజుడు కుంభమునికి సాష్టాంగ నమస్కారము చేసి, యిలా సంభాషించాడు "దయచేసి నన్ను మీ శిష్యునిగా స్వీకరించి, ఆత్మ జ్ఞాన గుహ్యార్థమును వుపదేశించండి, మీరే నా పూజ్యగురుదేవులని విశ్వసిస్తున్నాను".

అప్పుడు కుంభమునిలా సమాధానమిచ్చాడు, 'ఓ రాజా! మీకు రెండు కథలు చెప్తాను, ఒకటి పండితుడు చింతామణి కథ, రెండవది ఏనుగు కథ పూర్వ కాలమున సకల శాస్త్రపారంగతుడైన, వొక ధనికుడుండేవాడు అతను చింతామణిని పొందటానికై, యెన్నో పూజలు, ప్రార్థనలు, యజ్ఞ, యాగాదులు చేశాడు. ఆ చింతామణి చాలా ప్రతిభ కలది అస్ఫటిక రత్నము మనకు యేదికోరితే అది ప్రసాదించగల సమర్థత వున్నది, ఆ ప్రకాశవంతమైన రత్నం చింతామణిని తనముందు చూచాడు.

అప్పుడు తనలో యిలా అనుకొన్నాడు, "ఇది చింతామణి కాదనుకొంటాను, చింతామణి కఠోరమైన తపస్సు వలనే లభించగలదు, నేనంతటి గొప్ప తపస్సు చేయలేదు

గదా!" అలా తనకు లభించిన సువర్ణావకాశమును వదులుకొని, ఆ రత్నము కొరకు, ఎక్కడెక్కడో తిరిగాడు. ఒక సిద్ధుడతని తెలివి తక్కువ కద్దం పట్టాలను కొన్నాడు.

అతను ధగ ధగలాడే వొక చిన్న గాజుముక్కనతడు వచ్చే దారిలో వేశాడు, ఈ చదువు కొన్న మూర్ఖుడు యీ గాజుముక్కను నిజమైన చింతామణి రత్నమని భ్రమించాడు వెంటనే దానినానందముతో, అందుకొని భద్రంగా దాచుకొన్నాడు. ఆ చింతామణి తాను కోరినదల్లా యివ్వగలదను కొన్నాడు, ఆ నమ్మకంతో తనకున్నదంతా దానంచేశాడు. ఈ నకిలీ రత్నమును తీసుకొని, అరణ్యంలోకి వెళ్ళి, విశ్రాంతి తీసుకొన్నాడు, ఈ నకిలీ రత్నము వలన, అతనికెలాంటి లబ్ధి లభించలేదు పైగా తన మూర్ఖత్వము ప్రగాఢమైన అజ్ఞానము వలన యెన్నో బాధలకు, కష్ట నష్టాలకు గురైనాడు".

"ఇప్పుడు రెండవ కథను చెప్పాను శ్రద్ధగా వినండి, వింధ్య పర్వత శ్రేణిలో వొక పెద్ద బలసిన యేనుగు వుండేది, అది వన్య మృగాల వేటగాని వుచ్చులో చిక్కుకున్నది. అతను దానిని చాలా ధృడమైన వుక్కుగొలుసుతో బంధించాడు, దానికి చాలా పొడవైన, పదునైన దంతాలువున్నాయి, ఆ దంతాలతో, ఏనుగు ఆ సంకెళ్ళను ఛేదించి పరుగెత్తింది. అతను నేల మీదపడ్డాడు అతను పెద్దగొయ్యి తవ్వి, పైన మెత్తని గడ్డి, ఆకులు కప్పాడు. స్పర్శ ప్రలోభానికి లోనయ్యే ఆ యేనుగు గోతిలోపడి, వేటగాని హింసకు గురైనది. ఆ యేనుగు వేటగాడు నేల మీద పడ్డప్పుడు చంపివేసినట్లయితే, తను గోతిలో పడివుండేది కాదు. అలాగే తెలివి తక్కువ మానవులు దూరదృష్టితో తమకు భవిష్యత్తులో కలిగే ఆపదలకడ్డు కట్టవేయకుండా, ఆ వింధ్య పర్వత శ్రేణిలోని యేనుగులా ఆపదలకాహుతై పోతారు."

అప్పుడు శిఖధ్వజుడిలా అన్నాడు "ఓ దివ్య కుమారా! కుంభమునీ! దయచేసి నాకు చింతామణి, ఏనుగు కథల అంతరార్థమును వివరించవలసినది. అప్పుడు కుంభముని యిలా సమాధానం చెప్పాడు," చింతామణి కొరకు వెంపరలాడిన, ఆ పండితునకు కేవలము శాస్త్ర జ్ఞానము, వాచాజ్ఞానము తప్ప అనుభవజ్ఞానము, తత్త్వ జ్ఞానములేదు, అతను రత్నము కోసం వెదికాడేగాని, ఆ రత్నమేమిటో, యెలా వుంటుందో, అతనికి తెలియదు. అలాంటి వ్యక్తివే నీవు ఎందుకంటే నీవు పవిత్ర గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం చేసినా, మనశ్శాంతిలేదు, నీవు నీ భార్యను, బంధువర్గమును, రాజ్యమును, ప్రజలను, సంపదలన్నిటినీ త్యజించావు కాని వాటిలో నిజమైన చింతామణిలేదు."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జూన్ 2017

03 శని - జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి దశమ వార్షికారాధన.

09 శుక్ర - పౌర్ణిమ , శ్రీ సద్గురు పాద పూజ.

19 సోమ - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

22 గురు - మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

24 శని - అమావాస్య.

జూలై 2017

04 మంగ - తొలి ఏకాదశి - శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

09 ఆది - ఆషాఢ (గురు) పౌర్ణమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన,చాతుర్మాస్య దీక్షా ప్రారంభం.

16 ఆది - దక్షిణాయన ప్రారంభం.

18 మంగ - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

22 శని - మాస శివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం.

23 ఆది - అమావాస్య.

26 బుధ - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'మహాపాపాది పాపాని, గీతాధ్యానం కరోతిచేత్ క్వచిత్ స్పర్శం న కుర్వంతి నళినీదళ మంభసా' - అన్నది శాస్త్ర ప్రమాణమే కదా! అందువలననే సద్గురుదేవులు భక్తులను వుద్బోదిస్తూ "పడవలో ప్రయాణం



చేసే ప్రయాణీకుడు స్థిరంగా పడవలో వుంటే తాను ఏ క్రియలో వున్నా, నిదురించినా, ఏదైనా సంభాషణలో వున్నా నావికుడు అతనిని ఒడ్డుకు చేరుస్తాడు. అలాగే సంసార సాగరంలో వున్న సాధకుడు తన గృహస్థాశ్రమ ధర్మంగా ఏ విధులు నిర్వహించినా సద్గురు మూర్తి సమాశ్రయం పొంది ఆయన యందు పరిపూర్ణ విశ్వాసంతో లక్ష్యార్థ సాధన చేస్తే తప్పక తన గమ్యాన్ని చేరుకో గలుగుతాడు.

అయితే ఆ సాధకుడు గురుబిడ్డ అయి వుండాలి. అంటే అధికారి అవ్వాలి. మానవునికి భగవానుడు చక్కని ఉపాధిని ప్రసాదించి సత్య మార్గంలో పయనించమన్నాడు. కాని సత్యమార్గం కానరావటం లేదు. కారణం తన మనస్సు స్వస్థానంలో ఉండకుండా, బహిర్ముఖమై బంధన తెచ్చి పెడుతోంది. జ్ఞానమార్గానికి దూరం చేస్తోంది. 'జ్ఞానం వినా మోక్షం న సిద్ధ్యతే' అన్నారు కదా! 'నాన్య పంథా విముక్తయే' ముక్తికి, బంధ విముక్తికి వేరొక మార్గం లేదు.

మనస్సు ప్రాపంచిక బంధాలకు ఆకర్షింప బడటానికి కారణం మనస్సు యొక్క ఆలంబనం అదే వాసన. అదే ఇంద్రియ లాలసత్వానికి దారితీస్తోంది. గుణాల ప్రేరణచేత ఇంద్రియాలు ప్రాపంచిక వాసనలకు ఆకర్షింపబడుతున్నాయి. మనస్సు యొక్క ఆలంబన విక్షేపానికి దారి

తీస్తుంది. సాధకుడు వ్యష్టిభావనను త్యజించి సమష్టి భావన పెంపొందించుకోవాలి. గురుమూర్తి నాకే సన్నిహితులు నాకే అన్ని సేవలూ లభించాలి, నేనే ఆయనకి అత్యంత ప్రియశిష్యుడను అనేది వ్యష్టి భావన. సద్గురుమూర్తి అందరివాడు అనేది సమిష్టి భావన. అంతేకాదు గురుశక్తి సర్వవ్యాపకమై సర్వసృష్టిలో సమస్త జీవరాసులలో 'నేను'గా ప్రకాశించే దివ్యశక్తి. ఉపాధి భేదమేగాని, నేనుకు భేదం లేదుకదా.

అందరి హృదయాలలో ప్రకాశించే గురుశక్తికి భేదభావము, ఎత్తుపల్లాలు, రాగద్వేషాలు, ఈర్ష అసూయలు వుంటాయా? అది పరిణామ రహితమైనది. స్థిరమైనది. మార్పుచెందేది మనస్సు యొక్క భావన. అందువలన అటువంటి సమిష్టి భావన ద్వారా సాధకుడు మనస్సు యొక్క విక్షేపాన్ని జయించ గలుగుతాడు. అది కేవలం గురుమూర్తి సమాశ్రయం ద్వారా సాధ్యపడుతుంది.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జూన్ 2017

09 శుక్రవారం - జేష్ఠ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

19 సోమవారం - శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ

జూలై 2017

04 మంగళవారం- తొలి ఏకాదశి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

09 ఆదివారం- ఆషాఢ (గురు) పౌర్ణమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.(చతుర్మాస్య దీక్షా ప్రారంభం)

18 మంగళవారం - శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ..

# నిజమైన విశ్వాసం - స్వామి రామతీర్థ

ఒకనాడు ఒక ఊళ్ళో కొందరు గొల్లస్త్రీలు పాలు అమ్ముకొని, తిరిగి తమ గ్రామం వస్తూండగా, దారిలో ఒకగుడిలో ఒక పురాణం శాస్త్రిగారు చెబుతున్న పురాణప్రవచనంలోని ఒక వాక్యం వారి చెవిని పడింది.

'ఓం శ్రీరామ' అనే ఒక్క పదం చాలు. దాని సహాయంతో మహా మహా సముద్రాలను కూడా అవలీలగా దాటవచ్చు' అని ఆయన చెబుతున్నాడు.

ఈ ఒక్క ముక్క ఆ అమాయకపు గొల్ల పడుచుల మనస్సులో బాగా నాటుకుపోయింది. వారి నిర్మల బుద్ధికి ఇది పరమసత్యమని తోచింది. వారు రోజూ నాలుగు అణాలు డబ్బు పడవమీద రానుపోనూ ఖర్చుపెడుతున్నారు. కాబట్టి "మహాసాగరాన్నే రామనామ స్మరణతో దాటవచ్చని శాస్త్రిగారు చెప్పారు కదా! ఈ సామాన్యమైన నదికి అనవసరంగా నాలుగు అణాలు ఖర్చుపెట్టి పడవ ఎక్కడమెందుకు?" అని వారి బుద్ధికి తోచింది.

పురాణం శాస్త్రిగారు చెప్పిన మాటయందు వారికి ఎంత గురి కుదిరిందంటే, నది దగ్గరకి వచ్చాక వారు పడవ కోసం ఎదురు చూడక, 'ఓం శ్రీరామ' అనుకుంటూ నది మీదుగా నడక సాగించారు. విశ్వాస ప్రభావం చేత వారు నీటి మీద అవలీలగా నడుస్తూ అవతలి తీరానికి చేరుకున్నారు.

అది మొదలుగా ఆ గొల్ల స్త్రీలు నది మీదుగా నడిచివచ్చి, పాలు పెరుగులు అమ్ముకుని తిరిగి యింటికి పోసాగారు.

ఒక నెల గడిచింది. గొల్ల స్త్రీలు తమలో తాను కూడబలుక్కుని "ఆ శాస్త్రిగారి పుణ్యమా! అని మనం రోజూ పావలా చొప్పున ఆదా చేస్తూ వస్తున్నాం. ఆయన మనకు నదిదాటే రహస్యం చెప్పకపోతే ఏమై వుండేది. అందుచేత మనం ఆయనకు కృతజ్ఞత చూపాలి. మనందరం ఒక రోజు ఆయన్ని మన యింటికి పిలిచి భోజనం పెడదాం" అనుకున్నారు.

గొల్లస్త్రీలు భోజనానికి ఆహ్వానించేసరికి ఆయన సరేనన్నాడు. విందు చేసే రోజు కూడా నిర్ధారణ అయింది. ఆ రోజు ఆయన్ను పిలచుకు

పోవటానికి ఆ స్త్రీలలో ఒకతె వచ్చింది. ఇద్దరూ నది దాకా వచ్చారు. బ్రాహ్మణుడు నిలబడిపోయాడు.

"ఆగారేమి శాస్త్రిగారూ? పదండి పోదాం" అన్నది ఆ స్త్రీ. "పడవ రానీ" అన్నాడు ఆయన.

"పడవ దేనికండీ? నీళ్ళ మీద నడిచిపోయే దానికి!" అంటూ ఆమె నది మీదుగా బయలుదేరింది. కానీ శాస్త్రిగారు ఆమెను వెంబడించ లేదు.

ఆ స్త్రీ తిరిగివచ్చి, "అయ్యా! మీ పుణ్యం వల్లనే కదా, మేము రోజూ పడవకేమీ యిచ్చుకోకుండా నదిని దాటుతున్నాం" అంటూ ఆ రోజు ఆయన చెప్పగా విన్నమాటలు, దాని వల్ల కలిగిన మేలు గురించి చెప్పింది.

"అలాగా! అయితే నేనూ 'ఓంకారం'తో నదిదాటటం అభ్యసిస్తాను" అన్నాడు. తరువాత ఆయన నదీ తీరంలో ఉన్న వారి సహాయంతో నడుముకు ఒక పగ్గం కట్టుకుని, దాన్ని వాళ్ళకిచ్చి, "నేను మునిగిపోయే పక్షంలో నన్ను పట్టుకుని బయటకు లాగండి" అని హెచ్చరించి, నదిలోకి కాలు పెట్టాడు. కానీ ఆయన నీటి మీద తేలనే లేదు. ఒడ్డున వున్న వాళ్ళు నీళ్ళలో నుండి ఆయనను బయటకు లాగారు.

'ఓం శ్రీరామ' అనే నామం తనను నదిని దాటిస్తుందనే విశ్వాసం ఆయనకు నిజంగా వున్నట్లయితే, నడుముకు తాడుకట్టి, ఒడ్డున వున్న వాళ్ళకిచ్చి వారిని సహాయం అడిగి ఉండేవాడు కాదు. అందుకే ఆయన నీటి మీద గొల్ల స్త్రీలకి మల్లే నడవలేక పోయాడు.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**యద్రోమ రన్ధ్రపరిపూర్తి విధానదక్షా**
**వారాహ జన్మని బభూవుర మీ సముద్రాః**
**త్వం నామనాధ మరవిన్ద దృశం యశోదా**
**పాణిద్వయాన్తర జలైః స్నపయాం బభూవ ॥**



తాత్పర్యము -

ఈ సముద్ర జలములు వరహావతారమందు ఏ దేవుని రోమ కూపముల నిండించు పనిలో సమర్థములు కానివి అయినవో యశోదమ్మ తామర వంటి కన్నులుగల ఆ దేవుని దోసిలి యందని నీళ్లతో స్నానము చేయించెను.

బంగారు తామర రేకుల మధ్య నీలమణిని వుంచినట్లు, యశోదమ్మ బంగారుతామర రేకుల వంటి తన తొడలమీద, నీలమేఘశ్యాముడైన చిన్ని కృష్ణుని పడుకో బెట్టుకుని, తన దోసిళ్లతో నీళ్ళు తీసి ఆ బిడ్డకు స్నానం చేయిస్తున్న ఆ దృశ్యాన్ని గగన వీధులలో నిలబడి చూస్తున్న వేల్పులు వింతగా చెప్పుకుంటున్నారు. 'ఎంత చిత్రంగా ఉంది!' అని.

"మన స్వామి వరాహ అవతారంలో సముద్రాలన్నీ కలిపిన నీరు ఆయన రోమకూపం నిండటానికి చాలలేదో, అణువులో అణువు అయిన స్వామిని బాలకృష్ణుని రూపంలో తల్లి యశోదమ్మ దోసిలి నీళ్లతో స్నానం చేయిస్తుంటే ఎంత చిత్రంగా ఉందో కదా!" అని దేవతలంతా చిత్రంగా చూస్తున్నారు ఆ దృశ్యాన్ని.

యశోదమ్మ తన చిన్నబిడ్డను పరమాత్ముడని గ్రహించకుండా ఆమె పైన తన వైష్ణవ మాయను కప్పి ఉంచగల సమర్థుడు ఆ చిన్ని కృష్ణుడు! అటువంటి బుజ్జి కృష్ణుడు మనందరినీ రక్షించుగాక!!

# ప్రాణాయామ సిద్ధి

- పరాశర ప్రసాద్

శ్రీరామకృష్ణ పరమహంస ఒకనాడు తన శిష్యబృందంతో సంచారం చేస్తూ నదీతీరాన బసచేసి, శిష్యులతో ఇష్టాగోష్ఠిలో వున్నారు. ఇంతలో ప్రాణాయామ సిద్ధిపొందిన ఒక యోగి పరమహంసగారి దర్శనార్థం వస్తూ నదీజలాలపై తేలుతూ అలవోకగా ఆవలి ఒడ్డుకు చేరుకున్నారు. పరమహంసగారు అంతా గమనిస్తూనే వున్నారు.

ఆ యోగి పుంగవుడు శ్రీరామకృష్ణులకు నమస్కరించి, తాను పొందిన ప్రాణాయామ సిద్ధిని గురించి వివరించి, తాను నదీజలాలపై తేలుతూ ఎంత దూరమైనా పయనించగలనని చెప్పారు. శ్రీపరమహంస తిరిగి ఆ యోగిని ప్రశ్నిస్తూ "మీకు ప్రాణాయామ ప్రక్రియను అభ్యసించ డానికి ఎంతకాలం పట్టింది?" అన్నారు. యోగి సమాధానం చెబుతూ "5సంవత్సరాలు చాలా శ్రమతో అభ్యసించాను" అని చెప్పారు.

శ్రీరామకృష్ణులు చిరునవ్వుతో "నదిని దాటటానికి నేను కేవలం ఐదు పైసలు ఇచ్చాను. ఆ చిన్న విషయానికి సంవత్సరాలు శ్రమ పడవలసిన పని లేదే! ఆ కాలాన్ని ధ్యానానికి వినియోగిస్తే, ఆత్మజ్ఞాన సంపన్నుడవై జన్మరాహిత్యాన్ని సాధించేవాడవు. ఎంత తెలివితక్కువ పని చేశావయ్యా! చేపలూ నీటిలోనే మునుగుతూ తేలుతూ వుంటాయి. కానీ వాటికి మోక్షప్రాప్తి లభిస్తుందా?

ప్రాణాయామము మనస్సు నిలబడటానికి తోడ్పడుతుంది కాని సాధనకి గమ్యం కాదు. ప్రాణాయామం ద్వారా నిలిచిన మనస్సు ఆ ప్రక్రియ పూర్తికాగానే మేల్కొని సంచారం చేయక మానుతుందా! ప్రాణాయామం ద్వారా స్థిరమైన మనస్సులో అజ్ఞానం అవ్యక్తంగా వుంటుంది. తొలగదు. ప్రాణాయామం ప్రక్రియ మాత్రమే. మనస్సు శుద్ధి చెందాలంటే అజ్ఞానం తొలగాలి. సత్యాసత్య వివేకాన్ని కలిగియుండటమే మనస్సులో అజ్ఞానం తొలగినట్లు సంకేతం. ఆ స్థితిని సాధించటానికి సద్గురుమూర్తి సమాశ్రయం అవశ్యం. భౌతిక ప్రక్రియ ద్వారా దేహదారుఢ్యం పెరుగుతుంది గాని, జ్ఞానసముపార్జన సాధ్యంకాదు" అన్నారు పరమహంస.

# బ్రహ్మ వ్రాత

- ఎమ్. నాగేశ్వరరావు

"మహాప్రభో!" అంటూ భటుడు గుండెలు బాదుకుంటూ జనక మహారాజు సమక్షానికి నురగలు కక్కుకుంటూ వచ్చాడు. మహారాజు తలెత్తి భటునివంక చూశాడు. "మహాప్రభో!" రాత్రి నాకు వీధిలో మృత్యుదేవత ఎదురై భయంకరంగా నా వంక చూసింది. ఇక నాకు మృత్యువు తప్పదు! ఎట్లాగైనా మృత్యువును తప్పించుకోవాలి. ఈ క్షణానే ఇక్కడ నుండి పారిపోవాలి ........." అంటూ చెబుతున్నాడు.

"ఎక్కడికి వెడతావు? మృత్యువుని ఎవరు తప్పించుకోగలరు? నిజంగా మృత్యుదేవత నీకు కనబడిందా? ఆమె అతి సుందరంగా దివ్యంగా ఉంటుందే! నిజం చెప్పు" అంటూ జనక మహారాజు అడిగాడు. "కనబడింది మహారాజా! నాకు భయంకరంగా కనబడింది. నేను తక్షణం అయోధ్యానగరం పారిపోయి సీతమ్మవారి దగ్గర దాక్కుంటాను. ఇక త్వరగా పారిపోవాలి. ఒక్క క్షణం కూడా నిలవకూడదు" అన్నాడు.

"అయితే ఇప్పుడు నన్నేంచేయమంటావు?" అన్నాడు జనకుడు.

"మహారాజా! తమ గుఱ్ఱాలలో ఒక మంచి గుఱ్ఱాన్ని నాకిస్తే దానిమీద చిటికెలో నేను రేపు ఉదయానికి అయోధ్యాపురిలో వుంటాను" అన్నాడు. మహారాజు సరేనన్నాడు.

అశ్వాలలోకెల్లా గొప్పదైన 'మనోవేగం' అనే గుఱ్ఱాన్నెక్కి ఆ భటుడు అయోధ్యకు దౌడుతీశాడు.

ఆ రోజు రాత్రి జనకుడు మారువేషంలో మిథిలానగర వీధులలో తిరుగుతున్నాడు. "రాజర్షీ! వందనం!" అనే మాట వినబడింది మహారాజుకు. దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న మృత్యుదేవత నమస్కరిస్తోంది. జనకుడు కూడా తిరిగి నమస్కరిస్తూ వినయంగా "అమ్మా! నా భటుణ్ణి చూసి గెడ్లెర్రజేసి భయంకరంగా చూశావట కదా?" అని అడిగాడు.

"అతని సంగతి.....(అంటూ గుర్తుచేసుకుని) ఈ సంగతి మీకు చెప్పవలసినదే. నాకూ చాలా ఆశ్చర్యంగా ఉంది మహారాజా!" అన్నది.

"అతని వంక నేను భయంకరంగా చూడలేదు. ఆశ్చర్యంగా చూశాను. మానవులకు నేనంటే సహజంగా ఉండే భయం చేత అతనికి నేను అలా భయంకరంగా కనిపించి ఉంటాను" అన్నది.

**(తరువాయి భాగం 38వ పేజీలో చూడండి)**

# అనవోయి రామనామం

- రమణ ప్రసాద్

త్రేతాయుగ, ద్వాపర యుగాలలో ఋషులు, మునులు వేల కొలది సంవత్సరాలు తపస్సు చేసి భగవంతుని దర్శించారని శ్రుతులు, పురాణాలు చెబుతున్నాయి. కాని ఈ కలియుగంలో మానవుని ఆయుర్దాయమే నూరు సంవత్సరాలని చెప్పబడింది కాబట్టి సంవత్సరాలకొలదీ తపస్సు చేయటం మానవులకు సాధ్యం కాదు. అందుకనే మహాత్ములు సదా భగవన్నామ స్మరణ చేయమని ఉద్ఘోధిస్తున్నారు.

**హరేర్నామ హరేర్నామ - హరేర్నామైవ కేవలమ్ ।**

**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ - నాస్త్యేవ గతిరన్యథా ॥**

ఈ కలియుగంలో హరి నామమే శరణ్యం.

**నాస్తి నాస్తి కలౌ నాస్తి - హరినామ వినా గతిః ।**

**తస్మాద్యత్నేన జప్తవ్యం - హరేర్నామైవ కేవలమ్ ॥**

కాబట్టి పురుష ప్రయత్నంతో హరి నామం చేయవలెను.

**యత్ఫలమ్ నాస్తి తపసా - న యోగేన సమాధినా ।**

**తత్ఫలమ్ లభతే సమ్యక్ - కలౌ కేశవ కీర్తనాత్ ॥**

తపస్సు ద్వారా, సమాధి ద్వారా లభించని ఫలితం హరినామ కీర్తన వలన లభిస్తుంది.

రామనామం పాపాలను పారద్రోలుతుంది,శాంతిని చేకూరుస్తుంది,అజ్ఞానాన్ని పోగొడుతుంది. ఈ మంత్రం సంసార సాగరాన్నుండి తరింపజేస్తుంది కాబట్టి దీనిని తారకమంత్రమని అంటారు.

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।**

**సహస్ర నామ తత్తుల్యమ్ రామనామ వరాననే ॥**

శివుడు పార్వతితో, దేవీ! ఒకసారి రామ అంటే 10 సార్లు విష్ణువును స్మరించినట్లు, రెండు సార్లు రామ అంటే 100 సార్లు, మూడు సారులు రామ అంటే 1000 సారులు విష్ణునామం చేసినట్లవుతుంది" అని చెప్పాడు. ఆయన సదా ఈ తారక మంత్రాన్నే జపిస్తాడు.

"నేను భూమి మీదే ఉండి రాముని గుణగానాన్ని చేస్తాను. నేను వైకుంఠానికి రాను" అని చెప్పాడు హనుమంతుడు.

" ఒకసారి "రామా!" అంటే హనుమంతుని రోమాలు "రాం" అనేవి" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

యజ్ఞ యాగ క్రతువులు చేయాలంటే ధనము, మంది, మార్బలము అవసరం. వాటిని సామాన్య మానవుడు చేయలేడు. అలాగే జపతపాలు, యోగ సాధనలు ఆచరించలేడు. అనుక్షణం మాయ వెంటనంటి ఉండి సాధనకు అంతరాయం కలిగిస్తూ ఉంటుంది. ఆ మాయను దాటి భగవద్దర్శనం పొందటానికి హరినామమే శరణ్యం.

ఈ మాయ ఎలా కమ్మి ఉంటుంది అంటే, భగవన్నామం ఎందుకు చేయాలి? చేస్తే ఏమొస్తుంది? అనే అనుమానాలు; ఎలా చేయాలి? ఎక్కడ చేయాలి? ఎప్పుడు చేయాలి? అనే సందేహాలు వస్తాయి. దానితో హరి నామాన్ని చేయటం మొదలు పెట్టడు. భగవన్నామం ఎలా చేసినా పరవాలేదు. మనస్సు భగవంతునిపై ఉంచాలి. భగవన్నామం ఎప్పుడైనా, ఎక్కడైనా, శుచిగానైనా, అశుచిగానైనా చేయవచ్చు.

ఏ నామం చేయాలి? అని అడుగుతారు కొందరు. మనకు శ్రీ బాబూజీ మహరాజ్ వారు ప్రార్థనలో నామాలు ఇచ్చారు. అవి - ఓం నమో భగవతే కాళీ ప్రసాదాయ; ఓం హరేరమ హరేరామ రామ రామ హరే హరే। హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే; ఓం నమః శివాయ; ఓం నమో నారాయణాయ; ఓం తత్సత్ పరమేశ్వరీ; ఓం శ్రీం రాం; ఓం కృష్ణాయ, అని. మనకు ఇష్టమైన దేవుని నామం ముందు “ఓం” (అనే ప్రణవాన్ని)-చేర్చి, చివర “నమః” చేర్చాలి.

కొంతమంది ఛాందసులు,‘మేము బాగానే ఉన్నాం కదా! ఇంక భగవన్నామంఎందుకు చేయటం?’ అంటారు. కొంతమంది ‘హరినామం చేస్తే ఏమొస్తుంది?’ అని ప్రశ్నిస్తారు. మనం ‘మోక్షం వస్తుంది’ అని చెప్తాం. ఆ స్థితి ఏమిటో మాకు తెలియదు అని దాటేస్తారు.

అనుమోల్ రతన్ హై హరీనామ్ బినమోల్ కహే పర్ బికతా హై

భావ భక్తి నిజ ప్రేమ సే - కోయి లేనే వాలే ఆవో

రామ్ నామ్ రస్ బహతీ హై కోయి పీనే వాలే ఆవో।

“భగవన్నామ్ మీఠే హై । పీనే పీనే మే అపనే ఆప్‌కో భూల్‌జానా హై।” అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్. అన్ని అనుమానాలకు సందేహాలకు స్వస్తి చెప్పండి. రామ నామం అనండి. నిర్విరామంగా భగవన్నామం చేస్తే మనస్సు అమనస్క స్థితికి చేరుకుంటుంది. నీ మనస్సు నీ ధ్యేయవస్తువు పైన నిలుస్తుంది. బ్రహ్మ పదం లభిస్తుంది. ఏ మాత్రం సమయం వృధా చేయకండి. అనండి రామనామం ! పొందండి శాంతి ధామం !!

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

శ్రీబాబు కవిగారిని "లలితా సహస్ర నామాల భావార్థాన్ని తెలుగు పద్యాల రూపంలో అందరికి తేలికగా అర్థమయ్యేట్లుగా వ్రాయండి" అని ప్రోత్సహించారు. కవిగారు వ్రాయగలనా అని సందేహిస్తుంటే, శ్రీబాబు "జగన్మాత కరుణానిధి. ఆవే చేయించుకుంటుంది" అని అభయమిచ్చారు. కొంతవరకు పద్యాల రచన అయింది.



ఒకరోజున ఒక నామానికి సరైన భావార్థము స్ఫురించక, కవిగారు ఆలోచనలో వుండిపోయారు. ఆడవాళ్ళందరు పేరంటానికి వెళ్ళటం వలన యింట్లో ఎవరూ లేరు. కుర్చీలో కళ్ళు మూసుకొని కూర్చుని ఉన్న కవిగారు ఏదో అలికిడి అయి చూస్తే, వేణమ్మ యింట్లోకి వెడుతున్నట్లు కనిపించింది. "అమ్మా వేణూ!" అని పిలిస్తే, పలకక పోయేసరికి కవిగారు లేచి యిల్లంతా వెదికినా ఎవరూ కనబడలేదు. అంతలో కవిగారికి ఆ నామానికి భావార్థం ఏదో స్ఫురించింది. వ్రాద్దామని పూజ గదిలోనికి వచ్చి కూర్చునే సరికి, సరిగా వారికి స్ఫురించిన భావార్థమే అక్కడ వ్రాసి ఉంది.

ఆశ్చర్యానందాలతో కవిగారు తలమునకలై, శ్రీబాబుతో "**నాణెంపు రామాయణ గ్రంథరాజమున్ । వ్రాయించితివి బోయవాని చేత । జిహ్వాగ్రమున నిల్చి చెలువంపు భాగవతమ్ము పల్కితవి పోతన్న నోట॥** ఈనాడు జగన్మాతవై యీ అల్పునితో నీ దివ్యలీలలను వ్రాయించుకొన్నావు. "**మూకం కరోతి వాచాలం**" అన్న నీ కృపామహిమను యిలా నిరూపించావా బాబూ!" అని నవ్వి

ఊరుకున్నారు, ఆ తర్వాత కొద్దిరోజులలోనే కవిగారు వెయ్యి పద్యాలూ పూర్తి చేసి ఆ గ్రంధాన్ని శ్రీబాబుకు అంకితం చేశారు.

శ్రీసద్గురు దేవులకు మనోరంజకములైనవీ, భక్తులు ఇప్పటికీ ఎంతో ఆసక్తితోనూ, భక్తితోనూ పాడుకొనేవీ, ఎన్నో పాటలను, పద్యాలను కవిగారు రచించి భక్త లోకానికి అందించారు. స్వామివారి ఆస్థాన కవి వరేణ్యులుగా అందరి చేత మన్ననలను పొందారు.

శ్రీబాబు పరిపూర్ణానుగ్రహానికి పాత్రులై, కవిగారు 1963లో శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్న పవిత్ర సమయంలో, **"గరుడ పచ్చల కాంతి నల్లడల నింపి నీవు దర్శనమిచ్చుచున్నావు నాకు లభ్యమగును సమస్త కళ్యాణములను నీ పాదాశ్రితులకు మహనీయ మూర్తి"** అని స్మరించుకుంటూ సద్గురుదేవుల దివ్య దర్శనం పొందుతూ దేహం విడిచి పెట్టేశారు.

## (34వ పేజీ తరువాయి భాగం)

"మిమ్మల్ని అంతగా ఆశ్చర్యపరచిన విషయం ఏమిటి? అది నేను కూడా వినవచ్చామ్మా?" అని అడిగాడు.

"ఓ తప్పకుండా! రాజా! నేను వెళ్ళవలసిన చోటుకి సూటిగా వెడతాను కాని, దిక్కులు చూడను. నిన్న మీ భటుడు నా దారికి అడ్డు వచ్చాడు. నేను తలెత్తి అతని నొసటి వంక సూటిగా చూశాను. దిగ్భ్రాంతిలో మునిగి పోయాను. అతని నొసట రేపు ఉదయానికి అయోధ్యనగరంలో చనిపోవాలని వ్రాసి ఉంది. కానీ ఇదేమిటి? ఇతను ఇంకా ఇక్కడే ఉన్నాడే! ఇతను అయోధ్యా నగరంలో ఎలా చనిపోతాడు? ఇంతకాలానికి బ్రహ్మ వ్రాత తప్పిపోతుందా?" అనుకున్నాను ఆశ్చర్యంగా.

జనకమహారాజు చిరునవ్వుతో "అమ్మా! ఏదైనా తప్పుతుంది కానీ బ్రహ్మవ్రాత తప్పటానికి వీలులేదు. అమ్మా! ఏం చెప్పమంటావు? ఎవరో తరుముతున్నట్లుగా నా ధ్గరకు పరుగెత్తుకు వచ్చి నిన్న వాడు నా గుఱ్ఱాలలో అతి గొప్పదైన మనోవేగమనే గుఱ్ఱాన్ని అడిగి తీసుకుని, శరవేగంతో అయోధ్యానగరానికి వెళ్ళిపోయి, అక్కడ నీ దర్శనం కోసం ఎదురు చూస్తున్నాడు" అన్నాడు నిర్మలంగా!!

## విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

**ప్రేమాలాపం -**

"సఖులారా! రండి! మన ప్రియుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్దాం. ఆయన ఏ రంగు వస్త్రాలు ధరిస్తే మనమూ ఆరంగు వస్త్రాలనే ధరిద్దాం. ఆయన ఏ రంగు వస్త్రం కడితే మనం కూడా రంగుల వస్త్రాన్నే కడదాం. ఆయన కాషాయి వస్త్రం కడితే మనం కూడా కాషాయి వస్త్రాలనే కడదాం. ఆయన లాగ ముత్యాలుహారాలు అలంకరించుకుందాం లేదా. ఆయన ఆభరణాలు తీసి కురులు విరబోసు కోమంటే మనం అలానే చేద్దాం. ఆయనకు ఇష్టమైన రీతిలో అలంకరించుకొనిఆయనను అలరిద్దాం."



"హరీ! నువ్వు నా ప్రాణానివి. నువ్వులేని ఈ జీవితం నిరర్థకం. నువ్వే నాకు ఆసరా. నాకు కనిపించి నాకు ధైర్యం ఇయ్యి."

"సఖులారా మన కాకూడో (కృష్ణుడు) కఠోరుడే! ఆయన నెమలి పించం ధరించి, పీతాంబరధారియై, చెవులకు పెట్టిన కుండలాలు మెరుస్తుండగా, బృందావన వీధులలో నాట్యం చేస్తున్నాడే. చిత్తచోరుడైన నందలాల్ చరణ కమలాలకు నేను నమస్కరిస్తున్నాను!."

"మనం అవినాశి అయిన ప్రాణనాధుడి పాదాలను వదలవద్దు.

ఆయన మనకు తప్పక లభిస్తాడు. అది ఇది అననేల? స్వామి లేని అణువు లేదు.

తనలోనే దాగి ఉన్న ప్రభువును మీరా ఇలా సంభోదిస్తున్నది-

బసోమోరే నైనన్ మే నందలాల్॥
మోహని మూరత్ సావరి సూరత్ నైణా బనే బిశాల్।
అధర్ సుధారస మురళీ బాజత్ ఉర వైజయంతిమాలా॥
క్షుద్రఘంటికా కటితటి శోభిత నూపుర శబద విశాల్।
మీరా ప్రభు సంతన్ సుఖదాయీ భగత వత్సల గోపాల్ ॥

"నందలాల్! నువ్వు నాకళ్లల్లో నిలిచిపో! నీ మోహన రూపం, శ్యామల దేహం, నీ విశాలనేత్రాలు నన్ను ఆకట్టుకున్నాయి. నీ అధరాలకు అంటి ఉన్న మురళి, కంఠంలో అలరారుతున్న వైజయంతిమాల, నడుముకు కట్టుకున్న మొలత్రాడు యొక్క గజ్జెల రవళి నన్ను పరవశింపజేస్తున్నాయి. నీ దర్శనం ఆనందకరం. నువ్వు ఆనందప్రదాతవు."

"వ్రజధామంలో ఏమవుతోందో చూడవే సఖీ! శిరస్సున పెరుగు కుండలు పెట్టుకుని గోపికలు వెళ్తుంటే ఎక్కడి నుంచో వచ్చాడే నందకుమారుడు. ఆ పెరుగు కుండలను బ్రద్దల గొట్టిపోయాడు. బృందావన వీధులలో అతడు చేసే ఆగడం చూడముచ్చటగా ఉందే! నా మనస్సు శ్యామసుందరునిపైననే నిలిచిపోయిందే సఖీ!

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL